ప్రజాశక్తి
సోమవారం 9 సెప్టెంబర్ 2024
5
పార్వతీపురం మన్యం

నేడు గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి - పార్వతీపురం

భారీ వర్షం సూచన మేరకు గ్రీవెన్స్ (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక)ను సోమవార రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారీ వర్షాలు కారణంగా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, వాగులు, వంకలు పొంగి ప్రవహించే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. వాటిని దాటుకుంటూ రావడం సురక్షితం కాదని ఆ మేరకు గ్రీవెన్స్ రద్దు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి వ్యయ ప్రయాసలకు గురి అవుతూ పార్వతీపురం వరకు రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

సీతంపేట : భారీ వర్షాల కారణంగా సీతంపేట, ఐటిడిఎలో సోమవారం జరగబోయే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమంను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రద్దు చేస్తున్నట్టు ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

విస్తారంగా వర్షాలు

- నిండు కుండల్లా జలాశయాలు
- పత్తి, మొక్క జొన్న రైతులకు తీరని నష్టం
- ఆందోళనలో రైతన్నలు
- లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం
- నేడు పాఠశాలలకు సెలవు

సీతానగరంలో మండలంలోని నీటమునిగి వరిచేలు

రిజర్వాయర్ల నీటి మట్టాలు

రిజర్వాయరు	సామర్థ్యం	ప్రస్తుత నీటిమట్టం
తాటిపూడి	297 అడుగులు	295 అడుగులు
మడ్డువలస	65 మీటర్లు	64.14 మీటర్లు
వట్టిగెడ్డ	121.62 మీటర్లు	118.17 మీటర్లు
ఆంధ్ర	146 మీటర్లు	142.1 మీటర్లు
వెంగళరాయ	161మీటర్లు	160.32 మీటర్లు
పెద్దగెడ్డ	213.8 మీటర్లు	213.28 మీటర్లు
తోటపల్లి	105 మీటర్లు	103.8 మీటర్లు

ప్రజాశక్తి - పార్వతీపురం/రూరల్

జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జలాశయాలు నిండు కుండల్లా కనిపిస్తున్నాయి. శని,ఆది వారాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులు, వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఇప్పటికే జిల్లాలోని అన్ని చెరువులు నిండిపోయి ఉండడం వల్ల నిరంతరంగా కురుస్తున్న చినుకుల వలన చెరువులలో నీరు పొలాల్లోకి చేరుకుని పంటలను ముంచివేసే పరిస్థితి ఏర్పడుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాలతో మెట్ట పంటలైన పత్తి, మొక్కజొన్నకు నష్టం వాటిల్లనుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం కూడా భారీవర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించడంతో జిల్లా కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ జిల్లాలో వున్న ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. భారీ వర్ష సూచనలతో ఈనెలోనే రెండు సార్లు పాఠశాలలకు సెలవు ప్రకటించడం విశేషం. జిల్లావ్యాప్తంగా 189.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. సీతంపేట మండలంలో 29.4 మి.మీ అత్యధికంగానూ అత్యల్పంగా పార్వతీపురం 3.8మి.మీ వర్షపాతం నమోదైంది. నాగావళి, జంఝావతి, వేగావతి, సువర్ణముఖి, గోముఖి, చంపావతి తదితర నదుల్లో నీటి ప్రవాహ ఉధృతి పెరిగింది.

వట్టిగెడ్డ పూర్తి సామర్థ్యం 0.958 టిఎంసికాగా, ప్రస్తుతం 0.537 టిఎంసిలు ఉంది. ప్రస్తుతం 151 ఇన్‌ఫ్లో నమోదుకాగా, ఔట్ ఫ్లో 115 క్యూసెక్కులుగా రికార్డైంది. తోటపల్లి సామర్థ్యం 2.534 టిఎంసిలు. ప్రస్తుతం 1.785 టిఎంసీల నీరు నిల్వ ఉంది. 2,160 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, 1851 క్యూసెక్కుల నీరు ఔట్ ఫ్లో కనిపిస్తోంది. వెంగళరాయసాగర్ పూర్తి సామర్థం 1.683 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 1.455 టిఎంసీల నీరు ఉంది. ప్రస్తుతం 817 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉండగా, ఔట్ ఫ్లో 200 క్యూసెక్కులుగా ఉంది. ఇందులో 100 క్యూసెక్కులు నీరు గోముఖినదిలోకి, మరో 100 క్యూసెక్కు లు సువర్ణ ముఖి నదిలోకి వదులుతున్నట్టు అధికారులు చెబుతు న్నారు. పెద్దగెడ్డ పూర్తి సామర్థ్యం 0.949 టిఎంసిలుకాగా, ప్రస్తుతం 0.899 టిఎంసిలు నీరు ఉంది. ఇన్‌ఫ్లో 324 క్యూసెక్కులు కాగా, ప్రస్తుతం 300 క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉంది. జంఝావతిలోకి 492.67 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తుండగా, 492 క్యూసెక్కుల మేర అధికారులు బయటకి వదిలారు. నారాయణపురం ఆనకట్ట సామర్థ్యం 30.77 మీటర్లకుగాను 29.6 మీటర్ల వరకు నీటి మట్టం ఉంది.

అల్పపీడనం వల్ల అప్రమత్తంగా ఉండాలని ఈ మేరకు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ - 08963 293046 ఏర్పాటు చేశామన్నారు. అలాగే పార్వతీపురం, పాలకొండ రెవిన్యూ డివిజనల్ కార్యాలయాలు, మండలాల్లో కంట్రోల్ రూం లు ఏర్పాటు చేశామన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, రాకపోకలకు ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, నదులు, వాగులు, వంకలు, చెరువులను ఎవరూ దాటకుండా, దిగకుండా సూచనలు చేయాలని ఆయన తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాలలో ఎవరూ ఉండరాదని ఆదేశించారు. తక్షణం పునరావాస కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేశారు. కొండ శిఖర గ్రామాల పరిస్థితిని గమనించి వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని చెప్పారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని వెంకంపేట పంచాయితీలో వెంకమ్మ చెరువు వాలు గట్టు తెగిపోవడంతో శివారు కాలనీలన్నీ జలమయ మయ్యాయి. ఇదే పరిస్థితి జిల్లాలోని పలు మండలాల్లో ఉంది. గెడ్డలు ఉధృతంగా పొంగి ప్రవహిస్తుండడంతో పలు కాలనీలు జలమయమయ్యాయి. ఆదివారం ఉదయం నమోదైన జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలిలా ఉన్నాయి. రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో, ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు, చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

వీరఘట్టం: తుఫాను ప్రభావం వల్ల కురుస్తున్న వర్షాలకు ఆదివారం మండలంలోని కిమ్మీ సమీపాన గల నాగావళి నది తీర ప్రాంతాన్ని స్థానిక రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ప్రస్తుత నదిలో నీటి ప్రవాహం లేనప్పటికీ ఏ క్షణమైనా నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశాలుఉన్నాయని, వీటిని దృష్టిలో పెట్టుకుని రాత్రివేళ నదీ తీర ప్రాంతానికి రావొద్దని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కడకల్లా, చిట్టిపూడివలస, గడగమ్మ, పివిఆర్‌పురం, బిటివాడ, పనసనందివాడ నదీతీర ప్రాంతాలు సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు..

కూలిపోయే మట్టి గోడను తొలిగించాలి

భామిని : భామినిలోని ఎస్‌టి వీధిలో పాడైనా ఇంటి గోడని ఆదివారం రెవిన్యూ సిబ్బంది పరిశీలించారు. పాడైన ఇంట్లోని మట్టి గోడ పూర్తిగా శిథిలమైల పడిపోయే స్థితిలో వుంది అని, ప్రస్తుతం వర్షాలు వల్ల గోడ కూలి పోయి, ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున్న, పాడైన ఇంటి స్థలం యజమాని గుడ్ల మాధవరావుకు మట్టి గోడను తక్షణమే తొలిగించాలని డిప్యూటీ తహసీల్దార్ శేఖరం సూచించారు. కార్యక్రమంలో రెవిన్యూ పరిశీలకులు రాంబాబు పాల్గొన్నారు.

పడవలు నిలిపివేయాలి

మండలంలోని నేరడి, తలాడ, పసుకుడిలో వంశధార నదిలో నడుపుతున్న పడవలను నిలిపివేయాలని డిప్యూటీ తహశీల్దార్ శేఖరం అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిటి పడవ యజమానులతో ఆదివారం సమావేశమయ్యారు. వాయుగుండ ప్రభావంతో 3 రోజులు తీవ్ర వర్షాలు పడి, వంశధార నది ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున పడవలను మూడు రోజుల నిలిపివేయాలని తెలిపారు. కార్యక్రమంలో రెవిన్యూ పరిశీలకులు రాంబాబు ఉన్నారు.

జిల్లాలో వర్షపాతం వివరాలు మిల్లీమీటర్లలో...

వీరఘట్టం	14.2
సీతంపేట	29.4
భామిని	15.8
పాలకొండ	19.6
కొమరాడ	3.4
గుమ్మలక్ష్మీపురం	17.8,
కురుపాం	25.2
జియమ్మ వలస	13.0
గరుగుబిల్లి	6.6
పార్వతీపురం	3.8,
మక్కువ	6.2,
సీతానగరం	10.8,
బలిజిపేట	13.8
సాలూరు	4.4
పాచిపెంట	5.4

కుల్లిపోతున్న పత్తి

పాచిపెంట : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలో 3222 ఎకరాల్లో పత్తి పంట సాగువుతుంది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో వందల ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా మే నెలాఖరులో వేసిన పత్తి పంట పూర్తిగా నష్టం వాటిలిందని, ప్రస్తుతం చేతికందే సమయమని ఎడతెరిపి లేని వర్షాలకు పత్తి కాయలు కుళ్ళిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక కాయలు విచ్చుకున్న పత్తి కూడా తడిచి చేనుపైనే మొలకెత్తుతుంది. రైతుకు మూడు దశల్లో చేతికందే పత్తి పంట ఈ ఏడాది మొదటి దశలో అందాల్సిన పత్తి పంట తీవ్ర వర్షాలకు పిందెలు నేల రాలి రైతు ఆశలు అడియాశలు చేస్తుంది. లక్షలాది రూపాయలు మదుపులు పెట్టి ఆరుగాలలో శ్రమించి పండించిన పంట చేతికి అందే సమయంలో నాశనమవ్వడంతో వారి ఆవేదన వర్ణనాతీతం. అలాగే మొక్కజొన్న పంట కూ నేలకొరిగిపోతుంది. మండలంలో ప్రధాన వాణిజ్య పంటలైన మొక్కజొన్న 6వేల ఎకరాల్లోనూ, పత్తి 3222 ఎకరాల్లో సాగు అవుతుంది. సోమవారం కూడా భారీ వర్షాలు ఉన్నాయని అదికారులు హెచ్చరించడంతో రైతుల్లో మరింత ఆందోళన మొదలైంది. ఇప్పటికైనా వరుణుడు శాంతించి వర్షాలు తగ్గుముఖం పడితే మంచిది లేకుంటే ఈ రెండు పంటలకు పూర్తిగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉంటుంది ఏదైనా నష్టపోయే రైతులకు ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కుల్లిపోయిన పత్తిపంటను చూపుతున్న రైతు శ్రీను

నాలుగుఎకరాల్లో పంట నీటిపాలు

నాలుగు ఎకరాల పత్తి సాగు చేస్తున్నాను. వేలాది రూపాయలు మదుపు పెట్టి ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి అందే సమయంలో వరుస తుఫాన్లకు పూర్తిగా నష్టపోయింది. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

పందిరి శ్రీను,
రైతు, పాచిపెంట.

తీరని నష్టం

సుమారు 7 ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నాను. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టాం. కుటుంబం మొత్తం దుక్కులు దున్ని, విత్తనం నాటి కలుపు తీసి ఎరువులు పెట్టి పండించిన పంట చేతికందే సమయానికి వరుస తుఫానులతో పూత పిందెలు నేలరాలి పంట పూర్తిగా నష్టం వాటిల్లింది. అప్పు చేసి మదుపు పెట్టినా పంట చేతికందని పరిస్థితి. దీంతో అప్పు ఎలా తీర్చాల్లో తెలియని పరిస్థితి.

జమ్ము తవిటిరాజు,
రైతు, పాచిపెంట.

పార్వతీపురంలో జలమయమైన లోతట్టు ప్రాంతం

ముంపునకు గురవుతున్న వరిచేలు

సీతనగరం : మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వరి పంట ముంపునకు గురవుతుంది. అలాగే గాలులతో అక్కడక్కడ చెరుకు పంట ఒరిగిపోయింది. లక్ష్మీపురం, చల్లమనాయుడువలస, బూర్జ గ్రామాల్లో వరద తాకిడితో వరి చేల్లోకి నీరు రావడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అలాగే సువర్ణముఖి నదిని నీరు పెరిగింది.

వరద ప్రభావిత ప్రాంతాల్లో అప్రమత్తం కావాలి

జియ్యమ్మవలస : ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు నాగావళి పరివాహక ప్రాంతమైన బాసంగి ముంపు గ్రామ ప్రజలంతా అప్రమత్తం కావాలని తహశీల్దార్ సీతారామయ్య తెలిపారు. ఆదివారం బాసింగలో మూడడ్ల ఆదినారాయణ ఇంటి గోడ వర్షానికి కూలడంతో ఆయన పరిశీలించారు. నాగవళి నది నీటిమట్టం రోజు రోజుకు పెరగడంతో ముంపు ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తం కావాలని ఎప్పటికప్పుడు సంబంధిత రెవెన్యూ అధికారులకు సూచనలు సలహాలు పాటించాలని కోరారు.

వణుకుతున్న గిరిజన గ్రామాలు

ప్రతి ఇంటా జ్వరపీడితులే
ఆసుపత్రులకు పరుగులు పెడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - సాలూరురూరల్

వాతావరణంలో మార్పులు సంభవించడంతో మండలం మొత్తమ్మీద మలేరియా, సాధారణ, దగ్గు, జలుబులతో ప్రజలు బాధపడుతున్నారు. నెల కిందట వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపాడు. అనంతరం బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండాలు,అల్పపీడనం ప్రభావాలతో వర్షాలు దంచికొడుతున్న సందర్భంగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. దీంతో మండలంలోని అనేక గ్రామాల్లో జ్వరాలతో ప్రజలు మంచనపడుతున్నారు. దీంతో మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులతో పాటు ఆర్‌ఎంపి వైద్యులు, మెడికల్ షాప్‌ల్లో రోగులు బారులు తీరుతున్నారు. ప్రధానంగా గిరిజన ప్రాంతాల్లో వర్షాకాలం వస్తే ప్రతి ఇంటా జ్వరాలతో బాధపడుతున్నవారు అధికంగా ఉన్నారు. గిరిశిఖర గ్రామాలకు రోడ్డు సదుపాయాలు లేక కొండలపై నుండి కిందకు అనేక ఇబ్బందులు పడుతూ రోగులను తీసుకొస్తున్నారు. మెదాన ప్రాంతాల్లోని వారు ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేసుకొనేందుకు ఎక్కువ మొత్తంలో డబ్బును ఖర్చు పెడుతున్నారు వర్షాకాలం వచ్చిందంటే ప్రైవేట్ వైద్యులు, మెడికల్ షాపుల యజమానులు లక్షల్లో సంపాదించుకుంటున్నారు. మామిడిపల్లి, తోణాం, బాగు వలస ఆసుపత్రులు కాకుండా స్థానికంగా వుండే మెడికల్ షాప్ లో వద్ద భారీగా జ్వర పీడితులు వైద్యం చేసుకుంటూ ఇళ్లను గుల్ల చేసుకుంటున్నారు. అనేక మంది ప్రభుత్వ ఆసుపత్రుల వైపు కూడా చూడడం లేదు. వాతావరణ మార్పులతో పాటు గ్రామాల్లో పారిశుధ్యం లోపించడం కూడా ప్రధాన కారణం. ప్రధానంగా గ్రామాల్లో పారిశుధ్యం పూర్తిగా లోపించడం వల్ల ఇలాంటి పరిస్థితులు వస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మా గ్రామంలో చాలా రోజులుగా వీధి కాలువల్లో మురుగు తొలగించలేదని తోణాంకు చెందిన శంకర్, సింహాచలం తెలిపారు. కనీసం వర్షాల కాలంలోనైనా కాలువల్లో బ్లీచింగ్ చేయలేదు. దీంతో గ్రామంలో అనేక మంది జ్వరాలతో బాధపడుతున్నారని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో గిరిశిఖర గ్రామాల్లో మలేరియా ప్రబలకుండా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని, ఆ గ్రామాలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

తోణాం పిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న రోగులు

జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం

ప్రతి గ్రామంలో జ్వరపీడుతులున్నారు. అన్నీ సీజనల్ జ్వరాలే. అక్కడక్కడ మలేరియా కేసులు ఉన్నాయి. వీటిని కూడా స్థానికంగానే నయం చేస్తున్నాం. వారికి సరిపడా మలేరియా మందులు ఉన్నాయి. పదేళ్లలోపు పిల్లలను, 60ఏళ్ల పైబడిన వారిని మాత్రమే సాలూరు ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నాం. మిగతా వారందరికీ స్థానిక ఆసుపత్రిలోనే వైద్యం చేస్తున్నాం.

ఎ.అనిల్‌కుమార్,
వైద్యాధికారి, తోణాం పిహెచ్‌సి.

నేడు తాగునీటి సరఫరాకు ఆటంకం

ప్రజాశక్తి - సాలూరురూరల్

పట్టణానికి తాగునీటి సరఫరా చేసే ప్రధాన వాటర్ వర్క్స్ సమీపంలో ఉన్న నాలుగో రిజర్వాయర్ మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా సోమవారం పట్టణంలో తాగునీటి సరఫరా వుండదని మున్సిపల్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలు ఒకరోజు సహకరించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ ఇసుక ర్యాంపు నిర్వహణ స్థలం పరిశీలన

ప్రజాశక్తి -భామిని

మండలంలోని కాట్రగాఢ -బి గ్రామ సమీపంలోని నేరడి బ్యారజీ వద్ద ప్రభుత్వం చేపట్టనున్న ఇసుక ర్యాంపును పాలకొండ సబ్‌కలెక్టర్ యస్వంత్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఇసుక డంపింగ్ యార్డ్ పరిశీలించి, ట్రాన్స్‌ఫోర్ట్, ఇసుక బుకింగ్ పోర్టల్ అంశాలని రెవెన్యూ అధికారులను అడిగారు. రిజిస్టర్డ్ వెహికల్స్ ద్వారా ట్రాన్స్‌పోర్ట్ చేస్తామని, మైనింగ్ శాఖ పోర్టల్ ఇసుక బుకింగ్ జరుగుతుందని రెవెన్యూ అధికారులు తెలిపారు. డిఆర్ఒ కేశవనాయుడు, డిప్యూటీ తహసీల్దార్ శేఖరం, ఆర్ఐ రాంబాబు ఉన్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లోనే డెంగీ పరీక్షలు

- 1272 మలేరియా కేసులు నమోదు
- 'ప్రజాశక్తి'తో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయపార్వతి ముఖాముఖి



డెంగీ జ్వరానికి సంబంధించిన నిర్ధారణ పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరుగుతాయని, ప్రయివేటు నర్సింగ్ హెూంల్లో నిర్ధారణ చేయకూడదని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి విజయపార్వతి చెప్పారు. పార్వతీపురం మన్యం జిల్లాలో సీజనల్ వ్యాధులు, జ్వరాల నియంత్రణకు చేపడుతున్న చర్యల గురించి ఆమె 'ప్రజాశక్తి'తో ముఖాముఖి మాట్లాడారు.

ప్రజాశక్తి - పార్వతీపురం

ఇంతవరకు నమోదైన మలేరియా, డెంగీ కేసులెన్ని? నియంత్రణ కు చేపడుతున్న చర్యలేమిటి?

జిల్లాలో ఇంతవరకు 1272 మలేరియా, 63 డెంగీ కేసులు నమోదయ్యాయి. గత ఏడాది కంటే డెంగీ కేసులు పెరిగాయి. వీటితో పాటు వైరల్ జ్వరాల నియంత్రణకు చర్యలు చేపట్టాం. జిల్లా వ్యాప్తంగా 743 వైద్య శిబిరాలు నిర్వహించాం. 1.95 లక్షల పరీక్షలు చేశాం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరిపడిన మందులు అందుబాటులో ఉన్నాయి. మలేరియా, డెంగీ జ్వరాల పట్ల అవగాహన కల్పిస్తున్నాం. జ్వరం మూడు రోజుల పాటు తగ్గకపోతే వెంటనే మలేరియా పరీక్ష చేయించుకోవాలి. అన్ని పిహెచ్‌సిల్లో ఈ పరీక్షకు సంబంధించిన కిట్లు సిద్ధంగా వున్నాయి.

డెంగీ నిర్ధారణ పరీక్షలు ఎక్కడ చేస్తారు?

జిల్లాలో డెంగీ జ్వరానికి సంబంధించిన నిర్ధారణ పరీక్షలు పార్వతీపురం, పాలకొండ ఏరియా ఆసుపత్రుల్లో చేస్తారు. ఇంకెక్కడా నిర్ధారణ పరీక్షలు చేయకూడదు. ప్రయివేటు ఆసుపత్రుల్లో డెంగీ నిర్ధారణ పరీక్షలు చేయకూడదు. అలా నిర్ధారించి చికిత్స చేస్తే చర్యలు తీసుకుంటాం.

డెంగీ జ్వరమని ఎలా గుర్తించాలి?

అకస్మాత్తుగా ఒంటి నొప్పులు వస్తాయి, కండరాలు, కీళ్ల నొప్పులు ఎక్కువగా వస్తాయి, కంటి చుట్టూ వాపు వచ్చి నొప్పి వస్తుంది. ఈ లక్షణాలు వుంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలి. అశ్రద్ధ చేస్తే మలం ద్వారా రక్తం పడుతుంది. వణుకుతో జ్వరం, తలనొప్పి ఎక్కువగా ఉంటే మలేరియా అని అనుమానించి పరీక్ష చేయించుకోవాలి.

దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

దోమల నివారణకు అనేక చర్యలు తీసుకుంటున్నాం. ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రేయింగ్ చేశాం. ఎసిఎం పిచికారీ చేయించడం జరిగింది. మలేరియా ప్రభావిత ప్రాంతాల్లో లక్షా 50వేల గంబూషియా చేప పిల్లలను చెరువుల్లో విడిచి పెట్టాం. లార్వా దశలో ఉన్న దోమలను ఈ చేపలు తినేస్తాయి. యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ కూడా చేపట్టాం.

అంబులెన్స్ లు,ఫీడర్ అంబులెన్స్ లు ఎన్ని ఉన్నాయి?

జిల్లాలో 19 అంబులెన్స్‌లు, 23 ఫీడర్ అంబులెన్స్‌లు ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో సేవలు అందిస్తున్నాయి.

ఏజెన్సీ ప్రాంతంలో దోమ తెరలు పంపిణీ చేశారా?

నాలుగేళ్ల క్రితం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు దోమ తెరలు పంపిణీ చేశారు. వాటి కాలపరిమితి అయిపోయింది. ఇప్పుడు మళ్ళీ పంపిణీకి 3.8లక్షల దోమ తెరల కోసం ప్రతిపాదనలు పంపించాం .

పిహెచ్ సిల పరిస్థితి ఎలా ఉంది?

జిల్లాలో 37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటిలో పది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కొత్త భవనాలు నిర్మాణంలో వున్నాయి. ఇవి వేర్వేరు దశల్లో ఉన్నాయి.

హాస్టళ్లలో విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేస్తున్నారా?

గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నాం. సచివాలయ ఎఎన్‌ఎంలు తనిఖీలు చేస్తున్నారు. హాస్టళ్లలో అనారోగ్యానికి గురైన విద్యార్థుల కోసం సిక్ రూంలు, రిజిస్టర్ లు నిర్వహించాలని కోరాం.

తక్కువ బరువు ఉండే పిల్లల కోసం తీసుకుంటున్న చర్యలేమిటి?

తక్కువ బరువు వుండే పిల్లల కోసం జిల్లాలో న్యూట్రీషన్ రిహాబిలిటేషన్ సెంటర్లు పార్వతీపురం, సీతంపేటల్లో ఏర్పాటు చేశాం. ఏజెన్సీలో ఎక్కువగా తక్కువ బరువుతో పిల్లలు పుట్టడం జరుగుతోంది. వీరిని ప్రత్యేక వైద్యుల పర్యవేక్షణలో వుంచి తగిన జాగ్రత్తలు తీసుకుంటాం.

గిరి శిఖర గ్రామాల్లో ఎలాంటి వైద్యసేవలు అందిస్తున్నారు?

గిరిశిఖర గ్రామాల్లో వైద్య సేవలందించేందుకు కంటెయినర్ ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాం. జిల్లాలో ఐదు చోట్ల ఈ తరహా వైద్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించాం. హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్ల సిబ్బంది, ఎఎన్‌ఎంల ద్వారా వారికి వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపడతాం.

గర్భిణుల హాస్టళ్ల సంఖ్య పెంచుతారా?

మన్యం జిల్లాలో గిరిజన గర్భిణుల కోసం మూడు వసతి గృహాలు ఉన్నాయి. గుమ్మలక్ష్మీపురం, సాలూరు, సీతంపేటలో ఈ హాస్టళ్లు ఏర్పాటు చేశాం. 7, 8 నెలల్లో గర్భిణులను కొండలపై నుంచి దింపి హాస్టళ్లలో మెరుగైన వైద్యం, పౌష్టికాహారం అందించేందుకు చర్యలు చేపడుతున్నాం. గుమ్మలక్ష్మీపురంలో 50 మంది, సాలూరు లో 30 మంది, సీతంపేట లో 16 మందికి వసతి కల్పిస్తున్నాం.

ఇంకా శాఖాపరమైన కార్యక్రమాలేమిటి?

రక్తహీనత నివారణలో భాగంగా ఈనెల 17 నుంచి 1నుంచి 19 ఏళ్ల పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తాం. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో వున్న పిల్లలకు అంగన్ కార్యకర్తలు, ఆశాలు, ఎఎన్‌ఎంల ద్వారా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ జరుగుతుంది.

వల్లంబారిడికి బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ఆర్‌టిసి సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

ఆర్టీసి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని ఉరిడి పంచాయితీలో గల వల్లంబారిడి గిరిజన గ్రామంలో ఆదివారం నూతన ఆర్టీసీ బస్సు సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ బస్సు గుమ్మలక్ష్మీపురం మీదగా పార్వతీపురం వరకు సేవలందించబడుతుందని, ప్రజల రాకపోకలకు మరింత సులభతరమైందని, కావున ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యులు రంజిత్ కుమార్ నాయక్, టిడిపి నాయకులు గొరిశంకర్, సుబ్బలక్ష్మి, యవరాజ్, మన్మద, ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రొబ్బ లోవరాజు, తదితరులు పాల్గొన్నారు.

పొలాలకు ప్రమాదం లేకుండా చర్యలు చేపట్టండి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఉమ్మడి జిల్లాలో నెలకొన్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అధిక వర్షాలు కురియనున్నాయని అధికారుల సూచనల మేరకు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అధికారులను కోరారు. ఆదివారం పార్వతీపురం మండలంలో పర్యటించిన ఆయన్ను ఎంపీడీవో అకిబ్ జావేద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పొలాలకు ఎటువంటి హాని కలగకుండా ఇరిగేషన్ అధికారులు, పంచాయతీరాజ్ సిబ్బంది, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ చెరువుగట్లను పటిష్టపరచాలని, అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు తదితరులు పాల్గొన్నారు.

అడ్డాపుశీలలో విరాళాలు వసూలు చేస్తున్న రైతుసంఘం నాయకులు

వరద బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు ఆధ్వర్యంలో మండలంలోని అడ్డాపు శీల పంచాయితీ పరిధిలోని పలు గ్రామాల్లో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకస్మిక వరదల వల్ల వారం రోజులుగా నీటిలో మునిగి సర్వం కోల్పోయిన విజయవాడకు చెందిన పలు ప్రాంతాల నిరుపేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. ఇప్పటికే సిపిఎం బాధితులకు సహాయక చర్యల్లో పాల్గొని పలు విధాలుగా సహాయాలు అందించిందని, వారికి మద్దతుగా విరాళాలు సేకరించి సిపిఎం రాష్ట్ర నాయకుల ద్వారా ఆర్థిక సహాయాన్ని బాధితులకు అందజేస్తామని తెలిపారు.

పునరావాస కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ వై.వెంకటరమణ ఆదివారం తెలిపారు. తుఫాను ప్రభావం వల్ల కురుస్తున్న వర్షాల కారణంగా నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లోకి వరద నీరు వచ్చినట్లయితే ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి చేరుకోవాలని ఆయన గ్రామస్తులను కోరారు.

నేడు జాబ్ మేళా వాయిదా

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా సోమవారం జరగాల్సిన జాబ్ మేళాను వాయిదా వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక ఐటిడిఏ గిరిమిత్ర సమావేశం మందిరంలో నిర్వహించనున్న జాబ్‌మేళాను వేస్తున్నామని, తదుపరి తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. ఈ వాయిదాను అభ్యర్థులు గమనించాలని కోరారు.

నేటి సమాజానికి బౌద్ధమే శరణ్యం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

అన్ని విధాలా సంక్షోభానికి గురై అశాంతి చోటు చేసుకుంటున్న వర్తమాన సమాజానికి బౌద్ధమే శరణ్యమని ప్రముఖ జర్నలిస్టు, బౌద్ధ సాహిత్య పరిశోధకులు బెందాళం కృష్ణారావు అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవోహోంలో బహుజన రచయితల వేదిక ఆధ్వర్యంలో కిలారు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ప్రముఖ రచయిత ప్రజ్ఞశ్రీ డాక్టర్ బండి సత్యనారాయణ రచించిన నిర్వాణ నవల ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధుని జీవితానికి సంబంధించి ఇప్పటి వరకు వచ్చిన సాహిత్యంలో అక్కడక్కడా కొన్ని కల్పిత కథలు చోటు చేసుకుంటున్నాయని, ఇవి బుద్ధుని బోధనలకు విరుద్ధంగా వుంటున్నాయని అన్నారు. ఆకాశవాణిలో సుదీర్ఘ కాలం పనిచేస్తూ అనేక పుస్తకాలను రచించిన బండి సత్యనారాయణ రచించిన ఈ నవల బౌద్ధాన్ని సరైన పద్ధతిలో అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తుందని అన్నారు. ఈ 'నిర్వాణ' కు నవల పాఠకులను ఏక బిగువున చదివిస్తుంది. ఆయన రచనలన్నింటిలో ఈ 'నిర్వాణ' నవల మంచి ముత్యంలా, ప్రకాశమానమౌతుందని ఆశిస్తున్నాను అన్నారు. ముందుగా ప్రముఖ కవి రచయిత గంటేడ గౌరీ నాయుడు చేతుల మీదగా ఈ పుస్తక ఆవిష్కరణ జరిగింది. ఈ సమావేశంలో మల్లిపురం జగదీశ్, సిరికి స్వామినాయుడు, పాలకొల్లు రామలింగస్వామి, పక్కి రవీంద్రనాథ్,చదలవాడ సత్యనారాయణ, గడగమ్మ రామకష్ణ, కాకిముక్కల నాగు, పి. రంజిత్ కుమార్, చుక్క పారినాయుడు తదితరులు ప్రసంగించారు. పట్టణానికి చెందిన సాహితీ అభిమానులు, కవులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్ట్స్ నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - సీతంపేట

ఇటీవల కురిసిన అకాల వర్షాలకు విజయవాడ వరద బాధితులకు ఆర్ట్స్ నాబార్డ్ అగ్రికల్చర్ సహకారంతో టన్ను రైస్ బ్యాగులు, నిత్యవసర సరుకులు 2 వ్యాన్లుతో పంపిణీ చేసి ఆర్ట్స్ డైరెక్టర్ నూక సన్యాసిరావు తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఇలాంటి విపత్తుల్లో సహకరించడంలో ఆర్ట్స్ ముందడుగు వేస్తుందన్నారు. అంతేకాకుండా గతంలో కరోనా, హుదూద్, తిత్లీ వంటి విపత్తుల్లోనూ ప్రజలకు సహాకారం చేయడంలో ఆర్ట్స్ సంస్థ ముందు అడుగు వేసింది.

విజయవాడలో వరదబాధితులకు ఆహారపొట్లాలు అందజేస్తున్న ఆర్ట్స్ ప్రతినిధులు

ప్రభుత్వ భూమిని సర్కారుకే అమ్మేసిన సర్పంచ్

- క్రిమినల్ కేసులు పెట్టాలి
- భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి
- 13న మక్కువలో ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి - మక్కువ

ప్రభుత్వ భూమిని సర్కారుకే అమ్మేసిన తూరుమామిడి సర్పంచ్ రెడ్డి కృష్ణంనాయుడిపై క్రిమినల్ కేసు పెట్టి అరెస్టు చేయాలని, పేదలు కట్టుకున్న ఇళ్లకు పట్టాలు ఇవ్వాలని, పేదలపై జులుం ఆపాలని, భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఈనెల 13న మండల ఆఫీసు వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు కొల్లి గంగునాయుడు తెలిపారు. ఈ సందర్భంగా తూరుమామిడిలో పేదలతో కలిసి కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ తూరుమామిడిలో తనకు ఎటువంటి హక్కులు ఎస్ఎఫ్‌లో లేనప్పటికీ సర్పంచ్ రెడ్డికృష్ణంనాయుడు తను, తన అనుచరులు పేరున రికార్డులు మార్పించి జగనన్న కాలనీకి ప్రభుత్వ భూమి అమ్మివేశాడని, దీనిపై లోకాయుక్తలో ఫిర్యాదు చేయగా రెవెన్యూ అధికారులే తూరుమామిడి జగనన్న ఇళ్ల స్థలాలు కొనుగోలులో తప్పులు జరిగాయని అంగీకరించారని అధికారులపై చర్యలు తీసుకుంటామని, డబ్బు రికవరీ చేసి ప్రభుత్వానికి కడతామని, వాస్తవ సాగుదారులకు భూమి అప్పజెప్తామని అంగీకరించినప్పటికీ ఇంతవరకు ఎటువంటి చర్యలు రెవెన్యూ అధికారులు తీసుకోలేదని అన్నారు. అలాగే ఇంత చేసిన సర్పంచ్ అధికార పార్టీలో చేరికతో ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని, వెంటనే ఆయనపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని, డబ్బు ప్రభుత్వానికి జమ చేయాలని, అధికారులు పై చర్యలు తీసుకోవాలని, భూమి రైతులకు అప్ప చెప్పాలని డిమాండ్ చేశారు. మండలంలో బడాబాబులు అనేక చోట్ల భూ కబ్జాలు చేస్తున్నప్పటికీ రెవిన్యూ అధికారులు నిమ్మక నేరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తూరుమామిడిలో సుమారు 20 ఎకరాల భూమి గిరిజనులకు, పేదలకు ఇచ్చిన" డి "పట్టా భూముల రికార్డ్ మార్చి వేశారని అన్నారు. మక్కువలో మెయిన్ రోడ్డుకు ఆనుకొని ఉన్న బైరిసాగరం చెరువు సుమారు 20 ఎకరాలు ఉండగా ఇప్పుడు పదెకరాలే ఉందని, మిగిలిందంతా కబ్జాకు గురైందన్నారు. అందులో కొంతమంది



ధర్నా కరపత్రాలు విడుదల చేస్తున్న గ్రామస్తులు, సిపిఎం నాయకులు

భారీ భవనాలు నిర్మించి కిరాణా, బట్టల షాపులు, హొటళ్లు, మందులు షాపులు కట్టేసి దర్జాగా అనుభవిస్తున్నారని అన్నారు. మజ్జి గౌరమ్మ గుడి వద్ద ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి 30 సెంట్లు ప్రభుత్వ భూమిని ఏకంగా తన లేఔట్‌లో కలిపేసుకున్నాడన్నారు. ఇలా మండలంలో భూ ఆక్రమణలు జరిగాయన్నారు. ఈ సమస్యలపై ఈనెల 13న మక్కువలో జరిగే ప్రదర్శన, ధర్నాకు ప్రజలంతా రావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తూరుమామిడి 4వ వార్డు సభ్యుడు కొల్లి శంకర్రావు, ఏగిరెడ్డి సూర్యనారాయణ, మాజీ వైస్ ప్రెసిడెంట్ కర్రీ గౌరినాయుడు, మడక ధనుంజయ, దుగ్గాడ తిరుపతి రావు, యాండ్రాపు పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు

ఎన్‌సిఎస్‌లో కార్మికులను ఆదుకోండి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ చక్కర కర్మాగారంలో పనిచేసిన కార్మికులను ఆదుకోవాలని కోరుతూ కార్మికులంతా ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రకు ఆదివారం వినతి పత్రాన్ని అందజేశారు. 2021 ఏప్రిల్లో ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా కర్మాగారంలో పనిచేసిన 264మంది సీజనల్ కార్మికులందర్నీ విధుల నుంచి నిలిపివేసిందని తెలిపారు. ఉద్యోగ విరమణ చేసిన, చనిపోయిన కార్మికులకు కర్మాగారం తరపున అందాల్సిన బెనిఫిట్స్, పిఎఫ్, గ్రాట్యూటి తదితర రాయితీలు అందలేదని, ఇదిగో అదిగో అంటూ కాలక్షేపం చేస్తున్నారని తెలిపారు. కార్మికులు విధుల్లోలేక, జీతభత్యాల్లేక ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నట్లు ఎమ్మెల్యేకు వివరించారు. తమకు న్యాయం చేయాలని వారంతా విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సోమవారంకర్మాగారానికి విచ్చేసి కార్మికులను కలిసి చర్చిస్తానని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో కార్మికనాయకులు సాల కొండలరావు, పల్లా శ్రీరామ్ , బార్నాల అప్పారావు,స్వామి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

శాస్త్రీయ సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

అశాస్త్రీయ భావాలు, మూఢనమ్మకాలు అభివృద్ధికి ఆటంకమని, శాస్త్రీయ సమాజ నిర్మాణానికి తీవ్రమైన కృషి చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా వార్షిక సమావేశం జిల్లా అధ్యక్షులు కొండపల్లి గౌరు నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగింది. ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ విద్య ద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. సైన్సు అన్ని సమస్యలకు పరిష్కారాన్ని ఇస్తుందన్నారు. కావున ప్రజాసైన్స్ ఉద్యమం ద్వారా శాస్త్రీయ సమాజ నిర్మానానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మూఢనమ్మకాల నిరోధానికి చట్టాన్ని తేవాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మహేష్ మాట్లాడుతూ చెకుముకి సైన్స్ సంబరాల్లో జిల్లాలోని ఉపాధ్యాయులంతా భాగస్వామ్యం కావాలని కోరారు. ఎపిటిఎఫ్ 257 జిల్లా అధ్యక్షులు నల్ల బాలకృష్ణ మాట్లాడుతూ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజాసైన్స్ ఉద్యమాన్ని నిర్వహించడానికి జెవివితో కలిసి పనిచేస్తామన్నారు. ఈనెల 14,15 తేదీల్లో అనంతపురంలో జరుగు జెవివి రాష్ట్ర వార్షిక సమావేశాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు గంట సోమశేఖర్‌ను జెవివి జిల్లా నాయకత్వం అభినందించింది. సమావేశంలో జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం జిల్లా నాయకులు సిహెచ్ రామకష్ణ, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయ ఫోరం జిల్లా నాయకులు సతీష్ రాజ్ , సమతా జిల్లాకన్వీనర్ పెదప్రోలు శైలజ, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ నాయకులు ఎన్‌రాం గాంధీ, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కుర్ర భాస్కర్, స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ నాయకులు యు.గోవిందరావు, జెవివి జిల్లా నాయకులు వంగపండు వసంతనాయుడు, బి.సంతోష్ కుమార్, జి.హేమ సుందర్రావు, జె.ఈశ్వరరావు తదితరులు చర్చల్లో పాల్గొన్నారు.

కూతవేటులో జలవనరులు... అరకొరగా తాగునీరు

- 5 రోజులకొకసారి నీటి సరఫరా...
- రంగుమారిన నీరే శరణ్యం
- దశాబ్దం దాటిన ఇదే పరిస్థితి
- కాగితాలకే పరిమితమైన సమగ్ర తాగునీటి పథకం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా ఉంది పట్టణ ప్రజల మౌలిక సదుపాయాల కల్పన పరిస్థితి. పార్వతీపురం జిల్లాగా ఏర్పడి రెండేళ్లయినా ఇంకా పట్టణంలో తాగునీటి సరఫరా సమస్య అధ్వానంగా ఉంది. పట్టణానికి కూత వేటు దూరానున్న తోటపల్లి, నాగవళి నదీ పరివాహక ప్రాంతంలో జలవనరులు పుష్కలంగా ఉన్నా ఏడాది పొడవునా పట్టణ ప్రజలకు రంగు మారిన తాగు నీటి సరఫరా జరుగుతుంది. శుద్ధ జలాల సరఫరాకు, అటు దశాబ్దాల కాలం నుంచి ఎన్నికవుతున్న ప్రజాప్రతినిధులు, ఇటు మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించేందుకు దృష్టి సారించక పోవడంతో దశాబ్ద కాలం దాటినా పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా సమస్య తీరడం లేదు. పట్టణంలోని 30 వార్డులకు తాగునీటి సరఫరా చేసే పైపులైన్లే లేవు. అక్కడ ఉంటున్న స్థానిక ప్రజలకు రెండు రోజులకొకసారి మున్సిపల్ ట్యాంకర్ ద్వారా అరకొరగా తాగునీటి సరఫరా జరుగుతున్నా ఆయా ప్రాంతాల్లో పైప్ లైన్ల ఏర్పాటుకు అటు పాలకవర్గ కౌన్సిల్ సభ్యులు గానీ, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు గాని చొరవ చూపకపోవడంతో ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాల పట్ల వారికి ఎంత ప్రత్యేక శ్రద్ధ ఉందో అర్థం అవుతుంది..

పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా నిర్వహణ కొరకు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, ప్రకృతి విపత్తుల సమయంలో నిర్వహణ ఖర్చు, తాగునీటి సరఫరా చేసే మోటార్ల మరమ్మతులకు, రిజర్వాయర్ నుండి ఇన్‌ఫిల్టరేషన్ బావుల వైపు నీరు మళ్లించేందుకు వేసిన ఇసుక బస్తాలకు, క్లోరినేషన్ కు, పైపులైన్ల మరమ్మత్తులకు, పంపు హౌస్, బూస్టర్ పంపుల విద్యుత్ బిల్లులు, తాగునీరు సరఫరా సిబ్బంది వేతనాలకు ప్రతి ఏటా రూ.40 లక్షలు దాటి నిధులను అంచనాలకు మించి ప్రతిపాదనలు చేస్తూ, ఖర్చు చేస్తున్నారే తప్ప ఖర్చుపెట్టిన నిధులకు ఫలితం మాత్రం కనబడడం లేదు అనేది అక్షర సత్యం. పట్టణంలో కుళాయిలు ద్వారా పట్టణ ప్రజలకు 24 గంటలు తాగునీరు సరఫరా చేసేందుకు అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో 2019లో పైలెట్ ప్రాజెక్టు

కుళాయి నీటి కోసం ఎదురు చూస్తున్న వృద్ధురాలు

పనులను ఎఐఐబి బ్యాంక్ సహకారంతో రూ.63కోట్లతో అప్పటి టిడిపి పాలకవర్గ కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపి హుటాహుటిన టెండర్లను కూడా పిలిచి పనులను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఎన్నికల కోడ్ వల్ల ఆ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. అనంతరం వైసిపి ప్రభుత్వం హయాంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ తాగునీటి సమస్యను ఇప్పటి మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు దృష్టికి తీసుకువెళ్లి సమగ్ర రక్షిత మంచినీటి పథకం కింద రూ.63 కోట్లు మంజూరు చేయించి టెండర్లు పిలిచి పట్టణంలో 26

కుళాయిల ద్వారా నీరు రాకపోవడంతో ట్యాంకు వద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

వార్డులో ఉన్న పండా వీధి రొడ్డును తవ్వి ప్రధాన పైపులు వేసి పనులను కూడా ప్రారంభించారు. అయితే సంబంధిత కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులో జాప్యం వల్ల ఈ పనులను అర్ధాంతరంగా నిలిపివేశారు. వైసీపీ ప్రభుత్వం పాలన ఐదేళ్ల ముగిసినా, మున్సిపల్ పాలకవర్గం కౌన్సిల్ సభ్యులు కొలువుదీరి 3 సంవత్సరాల 6 నెలలు కావస్తున్నా పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయాల్లో ముఖ్యమైన తాగునీటి సమస్య పరిష్కారం కాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పట్టణ ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తామని, రంగు మారిన నీటి సరఫరా జరగకుండా చూస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి గెలుపొందిన ప్రస్తుత ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తోటపల్లి బ్యారేజ్ వద్ద ఉన్న ఇన్ ఫిల్టరేషన్ బావులను, పంప్ హౌస్ వద్ద నీటి సరఫరా జరిపే మోటార్ల పనితీరును పరిశీలించి, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో అక్కడున్న పరిస్థితిని గురించి సమాచారం తెలుసుకున్నారు. పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా అందించేందుకు సమగ్ర ప్రణాళికలను తయారుచేసి సమస్య పరిష్కారం దిశగా పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ, మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు రోజు రోజుకి ఎక్కువ అవుతున్నాయి. కూటమి ప్రభుత్వ హయాములోనైనా పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు తీరుతాయేమోనని ప్రజల ఎదురుచూస్తున్నారు.

మృతుడి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న చిన్నశ్రీను, రాజన్నదొర

మృతుని కుటుంబానికి వైసిపి ఆర్థిక సాయం

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్ పరిధిలోని ఫార్మా కంపెనీలో ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతుల్లో ఒకరైన పార్వతీపురం మండలం డోకిశిల పంచాయితీ చలంవలసకు చెందిన జవ్వాది పార్థసారథి కుటుంబానికి వైసిపి అండగా నిలిచింది. ఈ మేరకు ఆదివారం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను), మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్న దొర, జిల్లా వైసిపి అధ్యక్షులు పరీక్షిత్‌రాజు, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు పార్థసారధి తండ్రి జవ్వాది కోటేశ్వరరావుకు పార్టీ తరపున రూ.5 లక్షల చెక్కును అందించారు. కార్యక్రమంలో జడ్పిటిసి బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, నాయకులు బలగ నాగేశ్వరరావు, బొమ్మి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణగూడలో 960 లీటర్లు బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని నారాయణ గూడ సమీపాన 960 లీటర్లు బెల్లం ఊటలను నేలమట్టం చేసినట్లు ఎస్సై ఎం.జగదీష్ నాయుడు తెలిపారు. సారా నిర్మూలనకు అందరూ సహకరించాలన్నారు. అదేవిధంగా వినాయకుడిని నిమజ్జ చేసినప్పుడు చిన్నపిల్లలు వెళ్లరాదన్నారు. ఓవర్ లోడ్ లోడుతో రవాణా చేస్తున్న ఐదుగురు ఆటో డ్రైవర్ల పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలో పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ సి బుక్ ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు.

నదిపై పడవ నడిపించేలా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో నాగావళి నదిపై అధికారుల పర్యవేక్షణలో పడవ నడిపించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం పూర్ణపాడు వద్ద ఉన్న నదీ ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు తుఫాను ఇంకోవైపు నది ప్రవాహం మరో వైపు ఆర్థిక భారం ఎన్నాళ్ళు ఈ కష్టాలు ఎన్నాళ్ళు ఈ నరక యాతన అని ప్రశ్నించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా నాగవల్లి నదిపై మర బోట్లను నడపకుండా అధికారులు నిషేధించడం మంచి నిర్ణయమన్నారు. అయితే ఒడిశాలో వర్షాలు తక్కువగా కురవడం వల్ల నాగావళి నది ప్రవాహం కొంతవరకు తగ్గుముఖంగా ఉండే పరిస్థితి ఉందని తెలిపారు. ఇలాంటి సందర్భంలో నాగావళి ఆవతల ఉన్న 9పంచాయతీల ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో కొమరాడ మండల కేంద్రానికి రావడానికి కొంతమంది నదిలో దిగి రావడం వస్తుండగా, మరి కొంతమంది కురుపాం మీదుగా పార్వతీపురం నుంచి సుమారు 70 కిలోమీటర్లు ప్రయాణించి కొమరాడ మండల కేంద్రానికి రావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇలాంటి సందర్భంలో ఒకవైపు ఆర్థిక పరిస్థితులు ఇంకో వైపు తుఫాను ఇంకోవైపు నది ప్రహం వల్ల నాగావళి అవతల ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం నదిలో నీటి ప్రభావం తక్కువగా ఉండడం వల్ల అధికారుల పర్యవేక్షణలో అత్యవసర పరిస్థితుల్లో మర బోట్లను నదిలో నడిపేలా అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే వంతెన పెండింగ్ పనులను పూర్తి చేయాలని అధికారులను కోరారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

రామభద్రపురం: గడ్డి మందు తాగి తారాపురం గ్రామానికి చెందిన రేగు తౌడు (59) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎఎస్ఐ రమణ తెలిపారు. మద్యానికి బానిసైన తౌడు పూటుగా మద్యం సేవించాడు. పని పాటా లేకుండా నిత్యం మద్యానికి బానిసైన తన జీవితం పట్ల విరక్తి కలగడంతో అదే సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు

కురుపాం నెయ్యిల వీధిలో చేపల ఆకృతిలో ఉన్న వినాయకుడు

సీతానగరంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం

జిల్లాలోని అన్నిగ్రామాల్లోనూ వాడవాడల్లో, వీధివీధిలో, ప్రధానకూడళ్ల వద్ద, రామ మందిరాల్లోను వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం ప్రారంభమైన ఈఉత్సవాలు గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. వివిధ ఆకృతులతో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలతో, డెక్ లతో, పటాస్ సామాగ్రితో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. విద్యుత్ కాంతులతో వీధులన్నీ మెరుస్తున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి

ప్రజాశక్తి - సాలూరురూరల్

మృతురాలు ఇందిర

మండలంలో కందులపదం పంచాయతీ తీనుసామంతువలసలో ఉతికిన బట్టలను తన ఇంటిలో ఆరబెడుతుండగా విద్యుత్‌షాక్‌కు గురై సీదరపు ఇందిరమ్మ (50) అక్కడిక్కడే మృతి చెందారు. ఇంటి స్లేడ్‌కు ఉన్న ఐరన్ మేకుకు విద్యుత్ తీగ తెగి తగలడంతో షాక్‌కు గురైనట్లు సాలూరు రూరల్ పోలీసులకు మృతురాలి కుమార్తె చంద్రకళ ఫిర్యాదు చేశారు. ఆమెకు నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న స్థానిక మంత్రి గుమ్మడి సంధ్యారాణి మృతురాలి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో పరామర్శించారు. ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియో అందించడానికి కృషి చేస్తానని మృతురాలి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. రూరల్ ఎస్ ఐ నరసింహ మూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుక్క కాటుకు వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలో మామిడిపల్లికి చెందిన బుగత చిన్నయ్య (53) తన పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా అటువైపునుండి వచ్చిన మూడు కుక్కలు కరవడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. ఆ సమయంలో పక్క పొలంలో పనులు చేస్తున్న వారు చూసి మామిడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సాలూరు ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేయగా అక్కడ వైద్యం చేశారు. నాలుగు రోజులు అక్కడ వున్న తర్వాత కొంత వరకు మెరుగవ్వడంతో ఇంట్లో పనులను తనకు తాను చేసుకోవడంతో అంతా బాగుందని భావించారు. ఆ సమయంలో వారం రోజులు క్రితం నుండి మళ్లీ కొద్దిగా వంట్లో నీరసంగా వుందని కుటుంబసభ్యులకు తెలపగా వెంటనే విశాఖపట్నం కెజిహెచ్ తీసుకెళ్లగా, శనివారం రాత్రి మృతి చెందారు. మృతునికి ఇద్దరూ కుమారులు. కాగా, వీరిలో పెద్దకుమారుడు 15 ఏళ్ల క్రితం కుక్క కాటుతో మరణించారు. మతుని కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే ఆర్ పి భంజ్ దేవ్, మండల టిడిపి అధ్యక్షులు ఆముదాల పరమేశ్ పరామర్శించారు.